


# టేకిట్ ఈజీ!! - 3

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## -10-

# నేను ఎవరు అనగా..

శనివారం మధ్యాన్నం మావిడికాయ పప్పు, కరకరలాడే చేమ బూరెలు, మజ్జిగ మిరపకాయలూ, గడ్డ పెరుగు గట్రా సరంజామాతో శాస్త్రోక్తంగా కుప్ప నూర్చి, "నేను ఎవరు?" అని ఆలోచించడం మొదలుపెట్టాను. ఎంతకీ తెగకపోతే మా పెద్ద దెయ్యాన్ని (అంటే పెద్ద పిల్లనన్నమాట, వెధవనుమానాలూ మీరూను..) అడుగుదామని దాన్ని పిలిచాను. అది పలకలేదు. అరిచాను. అది కిమ్మన లేదు. నాలుగు గావుకేకలు, ఆరు పెడబొబ్బలు పెట్టాను. అయినా నిశ్శబ్దం. చీమ ఈల వేసినా వినిపించేటంత నిశ్శబ్దం. ఇంక లాభంలేదని కాళ్ళీడ్చుకుంటూమెట్లదాకా వెళ్ళి, పాక్కుంటూ మెట్లెక్కి, దాని గది తలుపు మీద బలప్రయోగం చేసాను. పిడిగుద్దులు కురిపించాను. ఐదు అడుగులు వెనక్కి పరిగెత్తి, అక్కణ్ణించి మళ్ళీ అరబ్బీ గుర్రంలాఅంచెలంచెలుగా గేలప్పులేసుకుంటూ వచ్చి ఒక్క తాపు తన్నాను. డోరు కాస్త వంగింది.

అప్పుడు అది తలుపు తెరిచి, లాప్ టాప్ కవచాన్ని పక్కనెట్టి, చెవిలో గుచ్చుకుపోయిన హెడ్ ఫోన్ కుండలాను తీసి, ఏవిటి? అన్నట్టు చిరాగ్గా చూసింది ఆడ కర్ణుడిలా.

***"అది కాదే,నేను ఎవరు?"*** అని అడిగాను అమాయకంగా.

***"నీకేవైనా పిచ్చా నాన్నా? హోంవర్కు చేసుకుంటూంటే.."*** అని సగౌరవంగా నన్ను బైటికి గెంటేసి తలుపు వేసేసుకుంది.

ఇంక లాభం లేదని మా మూడేళ్ళ చిన్న శాల్తీని అడిగాను ***"బుజ్జి తల్లీ, నేను ఎవరు?"*** అని.

అది ఓ మాటు నవ్వి ***"ఇ హి హి, నువ్వు సివుడు, ఇదిగో నీ తిసూలం"*** అంది ఓ మూడు వేళ్ళు చూపిస్తూను.

***"నా తల్లే, నేనంటే ఎంత రెస్పెక్టే నీకు"*** అని దాన్ని దగ్గరకి తీసుకుంటుంటే అంది

***"ఒకే టైం అప్, ఇప్పుడు నువ్వు లాచ్ష సుడు, నేను సివుడు.."***.

నావల్ల కాలేదు. దాన్ని అలాగే మంచం మీద వదిలేసి, వంటింట్లోకొచ్చి లేడీస్ నడిగాను

***"నేను వరు?"*** అని.

***"పాలు, పంచదార, నూనె, నెయ్యి, కూరలు, ఉప్పు, పప్పులు, పళ్ళు, టూత్పేస్టు,బ్రష్షులు, సబ్బులు, షాంపూలు, పేపర్ టవల్స్"*** అంది సమాధానంగా.

***"అబ్బ , నేను ఇన్ని కాలేను గానీ, ఏదో ఒక్క దానికి ఫిక్స్ అవ్వు"*** అన్నాను సీరియస్ గా.

***"ఈ సరుకులన్నీ అయిపోయాయి. వెళ్ళి చప్పున తీసుకురండి."*** అంది పనిలో పడుతూ..

*"ఇవన్నీ తెచ్చేకన్నా, కొట్టుకి చెక్రాలెట్టి దొర్లించుకునొచ్చేస్తానే, అది బెటరు. అయినా అంత అన్నీ అయిపోయేదాకా ఏంచేస్తున్నావే"* అన్నాను చిరాగ్గా.

***"ఆ, అంట్లు తోముతున్నాను.."*** అంది కసిగా రైస్ కుక్కరు గిన్ని తోమేస్తూ. ఇంక అక్కడ వుండడం ఆరోగ్యానికి హానికరం అని గ్రహించి "***ఈ ఇంటికి ఏమయింది?***"అని ముకేష్ గాడి ఎడ్వర్టైజుమెంటులోలాగ బాధపడుతూ బైటికెళ్ళాను. అయినా మనలో మనమాట బ్రెష్షులు ఎలా ఐపోతాయండీ?టూత్ పేష్టులో నంచుకు తినేస్తారా? మరీ టూమచ్ అసలు.

సరే, కారేసుకు రోడ్డెక్కాను అలా కొట్టుమీదకెళ్ళొద్దావని. ఎర్రలైటు దగ్గర ఆగాను. నాముందున్న నాలుగో కారు వాడు పచ్చ బాణం సిగ్నలొచ్చినా కదలటంలేదు. ఒళ్ళు మండి **భ..య్యి**మని హారన్ కొట్టాను. దానికి నా ముందు కారు వాడు మనస్తాపం చెంది, విండో దింపి ***"యూజ్లెస్ ఫె.."*** అని ఏదో తిట్టాడు. దానికి నేను కలతపడి, కలవరపడి, అసలు హారన్ కొట్టడంలో నా ఉద్దేశ్యము, దానిలోని ఆంతర్యము, ఆ రెంటికీ గల కార్య కారణ సంబంధము వంటి లోతైన విషయాలు వాడికి చెబుదామని ఎడం చేత్తో ఏదో విన్యాసాలు మొదలెట్టాను. అనుకోకుండా లేవకూడని వేలొకటి పైకి లేచింది. అంతే, వాడు మరియు నా వెనకాల కారు వాడు ఇద్దరూ జంట హారన్లతో, ముక్క తిట్లతో నాకు వీడ్కోలు పలికారు.

నేను గబగబా కుడి రోడ్డు మీదకొచ్చి, కనిపించిన కాంప్లెక్స్ లోకి దూరి పార్క్ చేసేసా. అక్కడినించి మా "**నానావిధ**" షాప్ కి ఒక మైలుంటుంది. కానీ ఇదే బెటరు. అక్కడికెడితే పెడదామంటే పార్కింగ్ దొరకదు. తీద్దామంటే గేప్ దొరకదు. నేను కారు రివర్స్ గేర్లో వేస్తున్నానని తెలియగానే, సుమారు రెండువందల యాభైమంది ఆడ, మగ, పిల్ల, జెల్ల అందరూ కార్లలోను, కాలి నడకనా, నాకారు వెనక్కి వచ్చేస్తారు. అక్కడ పార్కింగ్ చేస్తారు. సాయంత్రం దాకా వన భోజనాలూ, వోణీ ఫంక్షన్లూ, ఉట్టికింద ముద్దలూ, అట్లతద్దులూ చేసుకుని, ఆనక నాకు శోష ఒచ్చాకా, అప్పుడు ఒక్కొక్కరే కదిలి వెళ్ళి రాత్రికి ఇల్లు జేరతారు. అప్పుడు ఆ కొట్టు వాడు ఇంటికెడుతూ, అర్ధరాత్రి నన్ను లేపి, నన్నూ, కారునీ ఇంటికి సాగనంపుతాడు.

అందుకని మైలు దూరాన్నే పార్కు చేసుకుని నడుచుకుంటూ షాపుకెళ్ళా. అక్కడన్నా "నేనెవరో" ఎవరికైనా సరిగ్గా తెలుస్తుందని ఆశగా లోపలికెంటరయ్యా. టమాటాల దగ్గర ఒకాయన పలకరించాడు

*" హల్లో, బావున్నారా?".*

*"ఆ బావున్నా సార్".*

*"ఏంటి కూరలకా?".*

*"లేద్సార్, ఇండియా వెళ్ళడానికి విమానం కొందామని.."* అన్నాను మెల్లిగా.

ఆయన నా కడుపులో ఒక పోటు పొడిచి, నెత్తి మీద ఒకటిచ్చి ***"జోకు..ఝో..కు..సరేగానీ ఇంతకీ ఈ మధ్యన ఏవన్నా రాసారా?"*** అన్నాడు పరధ్యానంగా.

నాకు తెలిసి ఇన్నేళ్ళుగా, ఇంతవరకూ నేను రాసినది ఒక్కటంటే ఒక్క వాక్యం చదివుండడు ఈ పీనుగ. కానీ కనిపించినప్పుడల్లా అడుగుతాడు, ఏవన్నా రాసారా, ఏవన్నా రాసారా అని. అందుకే *" యెస్సార్. ఇప్పుడే 10 నిముషాల క్రితం రాసాను. చూస్తారా?"* అని తీసి ఒక లిస్టు ఇచ్చాను.

*" పాలు, పంచదార, నూనె, నెయ్యి, కూరలు, ఉప్పు, పప్పులు, పళ్ళు, టూత్పేస్టు, బ్రుషులు, సబ్బులు, షాంపూలు, పేపర్ టవల్స్ ".*

అది చూసి ఆయనకి పిచ్చెక్కింది. *"ఎక్కడ దొరికారు సార్..మీరూ మీ వెర్రీని.."* అంటూ పారిపోయాడు, లిస్ట్ నామీద పడేసి.

*"పేతురూ, నీవు నన్ను వెడగుయనుచున్నావా, నీవు నన్ను సరిగా గ్రహింపలేదు పేతురూ.."* అంటూ ఆయనవెనకపడ్డాను.

ఆయన టమాటాల సంచీ నా మీద గిరాటెట్టి కొట్లోంచి బైటికి జంపు అయిపోయాడు. నేను నిర్లిప్తంగా బెండకాయలు గిల్లడం మొదలెట్టాను. ఇంతలో ఇంకొకావిడ నన్ను గిల్లింది *"యామండీ, మీరు తెలుగు క్లాసులు ఇంకా జెప్తున్నరా ?"* అని.

*"అవునండీ, ఆదివారాలు ఉదయం చెబుతున్నాను. మీ పిల్లల్ని పంపిస్తారా?"*

*"అబ్బే, ఇప్పుడు ఆల్లు హైస్కూల్ పోతున్నారు. తెలుగుకు టైమెక్కడుంటది?".*

నాకు చిర్రెత్తుకొచ్చింది. మరల్లాంటప్పుడు అడగడం ఎందుకు?. అందుకే అన్నాను

***"మీకు తెలిసున్న వాళ్ళెవరికేనా చెప్పండి వీలైతే.."*** అన్నాను.

***"సరే మరి, ఎడ్రస్ చెప్పండి.."*** అంది ఫోను తీస్తూ.

***"చెప్పను"*** అనేసి కాలీఫ్లవర్ల దగ్గరకెళిపోయా.

ఆవిడ మొహం బీట్రూట్ లా అయిపోయింది. ***"ఇలాంటి పాగల్ గాళ్ళు ఎట్లున్నరో ఈ దేషంలో.."*** అని గొణుక్కోవడం వినిపించింది.

"***ఇహ్హహ్హ***" అని నవ్వుకుంటూ ముందుకు సాగా.

ఒకళ్ళు వెర్రి అనీ, మరొకళ్ళు పాగల్ అనీ డిసైడ్ చేసారు ఇంతవరకూ.

ఇంతలో ఒక ముసలాయన నాదగ్గరికొచ్చి ***"సార్, ఆర్గానికి పెరుగంటే ఏమిటి సార్?"*** అన్నాడు ఆందోళనగా.

***"పార్థా, ఆర్గానిక్ ఆంబోతు, ఆర్గానిక్ పెద్ద ఆవు, ఆర్గానిక్ శోభనం చేసుకోగా పుట్టిన ఆర్గానిక్ ఆవు, ఆర్గానిక్ గడ్డి తిని, ఆర్గానిక్ గా నెమరేసి, ఆర్గానిక్ పాలిస్తే, వాటిని ఆర్గానిక్ గిన్నెలో, ఆర్గానిక్ మంటతో మరిగించి, ఆర్గానిక్ గా చల్లార్చి, ఆర్గానిక్ తోడుపెడితే, అప్పుడు ఆర్గానిక్ పెరుగు అవుతుంది"*** అన్నాను కనువిప్పు కలిగిస్తూ.

ఆయన కుడి చేత్తో గుండె నొక్కుకుంటూ పారిపోయాడు.

***"సార్ నేనెవరో చెప్పండి సార్.."*** అన్నాను వెనకనించి కేకేస్తూ.

***"నువ్వు దేవుడివి సామీ.."*** అంటూ అతను రన్నింగ్ లో రోడ్డుమీద వెడుతోన్న అంబులెన్స్ కేచ్ చేసి పారిపోయాడు. నేను కావలసినవి కొన్ని, అఖ్ఖర్లేనివీ అన్నీ కొనుక్కుని కౌంటర్ దెగ్గిరికొచ్చాను.

ఆవిడ అడిగింది ***"బాగున్నారా సార్."***.

నేను నిర్లిప్తంగా ఓ నవ్వు నవ్వి ***"నేను ఎవరిని?"*** అన్నాను.

ఆవిడ గెట్టిగా ఇంకో నవ్వు నవ్వి ***"ఆ ఆట ఆడాలంటే నేను కళ్ళుమూసుకోవాలి సార్. సరే సరే మళ్ళీ అడగండి"*** అంటూ కళ్ళు మూసుకుంది అరచెయ్యి కళ్ళకి అడ్డంపెట్టుకుని.

విధి లేక నేను అడిగాను ***"నేను ఎవరిని"*** అని నీరసంగా.

***"మీరు హోసే. హోసే వెళ్ళి కొబ్బరికాలు బ్రేక్ చేసి తే"*** అంది ఉత్సాహంగా.

హోసే గాడు పరిగెత్తుకొచ్చి "***పిల్చినావా అమ్మా***" అన్నాడు తెలుగులో.

ఆవిడ కళ్ళిప్పి ***"మీరు హోసే కాదు. మరైతే, మీరు శ్యాం భాయ్ పటేలా?"*** అంది మళ్ళీ కళ్ళు మూసుకుంటూ.

ఇంక నావల్ల కాలేదు. ఆ హోసే గాణ్ణి బతిమాలి బిల్లు వేయించుకుని బైటపడ్డాను, ఆవిడింకా కళ్ళు మూసుకుని ఉండగానే. ఈసురో మని కాళ్ళీడ్చుకుని, కారు వెనక్కి తోసుకుంటూ వచ్చి, అప్పుడు స్టార్ట్ చేసి, బైటపడ్డా. ఇక్కడ కూడా నేనెవరినో తెలియలేదు. ఫ్చ్..అనుకుంటూ.

ఇంటికొచ్చేసరికి మూడు శాల్తీలు మూడంకెలేసి పడుకున్నాయి. నేను సరుకులన్నీ లోపలెట్టి, తపస్సు చేసుకోవడానికి ఇది అనువైన సమయమని గ్రహించి, బేస్మెంటులోకెళ్ళా. అక్కడ కుర్చీలో కూర్చుని "నేనెవర్ని" అని అడుగుతూ తిరగడం మొదలెట్టా. కాసేపటికి అన్నసారం వంట పట్టి సాంపిల్ కునుకొకటి వచ్చి పలకరించివెళ్ళింది. ఆ మగతలో కళ్ళముందు ఎవరో శాల్తీ, బహుశా దేవుడనుకుంటా వచ్చి గాల్లో తేలుతూ నాముందు నిలుచున్నాడు. నాకు చప్పున ఏ స్తోత్రం గుర్తు రాక "గాల్లో తేలినట్టుందే.." అని పాట మొదలెట్టా చిటికెలేస్తూ. ఆయన ఒక చేతిలో వున్న గదతో సాంపిల్ కి ఓ దెబ్బేసి, శాంస్క్రీట్లో ఏదో చెప్పాడు. ఐఫోనులో ట్రాన్స్లేట్ చేసి చూసా. ***"ఒరేయ్ కుంకా, దేవుడొస్తే ఒక స్తోత్రమో,పద్యమో పాడాలి. ఏవీ రాకపోతే మూసుక్కూచోవాలి. అంతేగాని గాల్లో తేలినట్టుంది, సారొస్తారా, ఇప్పటికింకా నా వయసు నిండా పదహారే అని పాడకూడదు, సన్నాసీ.."*** అని కనిపించింది. ఆయన మనోభావాలు దెబ్బతిన్నాయని గ్రహించి నేను అడగాల్సిన ఒక్క విషయమూ అడిగేసాను "స్వామీ, నేను పిచ్చివాడినా, శివుడినా, వెర్రి వాడినా, పాగల్ గాడినా, దేవుణ్ణా, హోసే నా, పటేల్ భాయ్ నా" అని.

ఆయన ఆదిశంకర సినిమాలో సర్వదమన్ బెనర్జీలా నవ్వి ***"త్వమేవాహం"*** అని మాయవైపోయాడు. ఐఫోను చార్జి అయి చచ్చింది. ఇప్పుడు త్వమేవాహం అన్న ముక్కకి అర్థం తెలుసుకోవడం ఎలా? బాబ్బాబు మీకు తెలిస్తే చెప్పి పుణ్యం కట్టుకుందురూ...★★★

COMMENTS